# ఆదిలాబాద్-మంచిర్యాల



నేటి దినపత్రిక
# సూర్య
www.suryaa.com

◆ నిర్మల్ ◆ కొమురంభీం ఆసిఫాబాద్



బుధవారం 08 మే, 2024,
పేజీలు 04


## కౌంటింగ్ కేంద్రంలో పూర్తి స్థాయిలో సౌకర్యాలు కల్పించాలి

**- జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్**

**మంచిర్యాల ప్రతినిధి,మే07, సూర్య మేజర్ న్యూస్ :**

లోకసభ ఎన్నికలు-2024లో భాగంగా మే 13వ తేదీన పోలింగ్ అనంతరం జూన్ 4వ తేదీన జరుగనున్న కౌంటింగ్ ప్రక్రియ కొరకు జిల్లాలోని హాజీపూర్ మండలం ముల్కల్లలో గల ఐజా ఇంజనీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన కౌంటింగ్ కేంద్రంలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా పూర్తి స్థాయిలో సౌకర్యాలు కల్పించాలని జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. మంగళవారం హాజీపూర్ మండలం ముల్కల్లలో ఏర్పాటు చేసిన కౌంటింగ్ కేంద్రం ఏర్పాట్లను జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు), 003-బెల్లంపల్లి (ఎస్.సి) శాసనసభ నియోజకవర్గ సహాయ రిటర్నింగ్ అధికారి బి.రాహుల్, జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) సబావత్ మోతిలాల్, మంచిర్యాల రాజస్వ మండల అధికారి, 004- మంచిర్యాల శాసనసభ నియోజకవర్గ సహాయ రిటర్నింగ్ అధికారి వి.రాములు, ప్రత్యేక ఉప పాలనాధికారి (ఎల్.ఎ., ఆర్&ఆర్), 002-చెన్నూర్ (ఎస్.సి.) శాసనసభ నియోజకవర్గ సహాయ రిటర్నింగ్ అధికారి డి.చంద్రకళ, హాజీపూర్ తహశిల్దార్ పి.సతీష్కుమార్తో కలిసి ఏర్పాట్లను పరిశీలించారు.

తరువాయి 3లో




## పెద్దపల్లి పీఠం దక్కెదెవరికో..?

... గెలుపులో కార్మికులు,కార్మికుల కుటుంబాల ఓట్లే కీలకం .... హస్తానికి వారసత్వ వాదన .... బిఆర్ఎస్‌కు పార్టీ ఫిరాంపులు .... కమలానికి క్యాడర్‌లేమి



2 లో




## అకాల వర్షంతో చేతికొచ్చిన పంట నీటి పాలు

**- సకాలంలో ధాన్యాన్ని కొనుగోలు చేసి ఉంటే ఇంత నష్టం చేకూరేది కాదు**



**మందమర్రి టౌన్, మే 7, సూర్య మేజర్ న్యూస్.**

అకాల వర్షం రైతన్నకు శాపంగా మారి తీవ్ర నష్టాన్ని మిగిల్చింది. పంట చేతికొచ్చిన వేళ అన్నదాతను ఆగం చేసింది. మందమర్రి మండలంలోని పలు గ్రామాలలో మంగళవారం కురిసిన వర్షానికి తాటిపత్రిలు అందుబాటులో లేక వర్షానికి ధాన్యం నీటమునిగి ముద్దయింది. మండలంలోని సారంగపల్లి గ్రామంలోని కొనుగోలు కేంద్రాలలో ఆరబోసిన ధాన్యాన్ని కాపాడుకునేందుకు రైతులు నానా తిప్పలు పడ్డారు. ఆరుగాలం ఎంతో శ్రమించిన రైతులు పండించిన వరి ధాన్యం అకాల వర్షం కారణంగా కళ్ళ ముందు నీళ్ల పాలు కావడంతో అవేదన వ్యక్తం చేశారు. కొనుగోలు కేంద్రంలోని కల్లాల్లో ధాన్యాన్ని ఆరబోసి అమ్మేందుకు వేచిచూస్తున్న తరుణంలో మంగళవారం కురిసిన వర్షంతో ధాన్యం తడిసి ముద్దయింది. ప్రభుత్వ యంత్రాంగం సకాలంలో ధాన్యాన్ని కొనుగోలు చేసి ఉంటే ఇంత నష్టం చేకూరేది కాదని అన్నదాతలు మొరబెట్టుకుంటున్నారు. అదే విధంగా భారీ గాలులతో కోతకు వచ్చిన మామిడికాయలు ఈదురు గాలులతో కూడిన వర్షానికి నేలరాలాయి. అకాల వర్షం కారణంగా నష్టపోయిన రైతులకు ప్రభుత్వం నష్టపరిహారం అందించి ఆదుకోవాలని, అదేవిధంగా తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేయాలని రైతులు కోరుతున్నారు.





## విద్యార్థులు శాస్త్రీయ దృక్పథం అలవర్చుకోవాలి

**- జిల్లా కలెక్టర్ రాజర్షి షా**




**అదిలాబాద్ మే 07,సూర్య మేజర్ న్యూస్,**

విద్యార్థులు శాస్త్రీయ దృక్పథం అలవర్చుకోవాలి. జిల్లా కలెక్టర్ రాజర్షి షా అన్నారు.జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో స్థానిక డైట్ కళాశాలలో నిర్వహించిన సైన్స్ సమ్మర్ క్యాంప్ లో ముఖ్య అతిథిగా పాల్గొన్న జిల్లా కలెక్టర్ రాజర్షి షా. విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతూ సమాజంలో పెరుగుతున్న మూడనమ్మకాల పట్ల అప్రమత్తంగా ఉండాలని శాస్త్రీయ వైఖరి ద్వారానే మూఢనమ్మకాలనుంచి బయటపడచ్చని పేర్కొన్నారు. ప్రతి అంశాన్ని ప్రశ్నించి స్వీకరించాలని పేర్కొన్నారు.ఈ సందర్భంగా సైన్స్ సమ్మర్ క్యాంప్ లో విద్యార్థుల యొక్క ప్రదర్శనను తిలకించారు. సమాజంలో మూఢనమ్మకాలను నిరోధించడంలో శాస్త్రీయ వైఖరిని పెంపొందించడంలో జన విజ్ఞాన వేదిక చేస్తున్న కృషిని అభినందించారు.ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి ప్రణీత, జిల్లా సైన్స్ అధికారి రఘురమణ, సెక్యులర్ అధికారి, జన విజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్ష కార్యదర్శులు సంతోష్ కుమార్,భేదోడకర్,విద్యార్థులు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.



# పెద్దపల్లి పీఠం దక్కేదెవరికో....?

.... కార్మికుల,కార్మిక కుటుంబాల ఓట్లే కీలకం
.... హస్తానికి వారసత్వ వాదన
.... బిఆర్ఎస్‌కు పార్టీ ఫిరాంపులు
.... కమలానికి క్యాడర్‌లేమి

**ఆదిలాబాదు ఉమ్మడి జిల్లా ప్రతినిధి,మే07,సూర్య మేజర్ న్యూస్**

ఈ నెల 13న జరుగనున్న పార్లమెంట్ ఎన్నికలలో పెద్దపల్లి పీఠాన్ని దక్కించుకోనేది ఎరనేది ఉత్కంఠ రేపుతున్నది.పెద్దపల్లి పార్లమెంట్ పరిధిలో ఏడు శాసన సభ స్థానాలు ఉన్నాయి.ఏడు శాసన సభస్థానాలలో కాంగ్రెస్ పార్టీకి చెందిన వారే గెలుపొందారు.ఐనప్పటికి కాంగ్రెస్ అధిష్టానం మొదటి నుండి పార్టీ కోసం పని చేసిన వారిని కాదని కాకా కుటుంబానికి చెందిన గడ్డం వంశీకృష్ణకు టికెట్‌ను ఎట్టకేలకు కేటాయించారు.దీంతో కాంగ్రెస్ పార్టీకి చెందిన ఎమ్మెల్యేలు మొదట వ్యతిరేకించారు.కొద్ది రోజుల అనంతరం లోపాయికారి ఒప్పందం జరుగడంతోనే ఎమ్మెల్యేలు ప్రచారంలో పాల్గొంటున్నారని ప్రజలు అనుకుంటున్నారు.మరోవైపు పెద్దపల్లి సీటును కాంగ్రెస్ పార్టీలో మొదటి నుండి పని చేసిన వారికి కాకుండా కాకా కుటుంబానికి కేటాయించడంతో మరో సామాజికి వర్గానికి చెందిన ఎస్సీ నేతలు గుర్రుగా ఉన్నారు.ఒకే కుటుంబానికి చెందని వారికి మూడు పదవులా అని మరో కొందరు వాపోతున్నారు.బిఆర్ఎస్ కుటుంబ పాలనతో విసుగు చెందిన ప్రజలు శాసన సభ ఎన్నికలలో కాంగ్రెస్‌కు పట్టం కట్టారు.కాకా కుటుంబానికి చెందిన వారికే పెద్దపల్లి సీటును కేటాయించడంతో ప్రజలు ఏమేరకు ఆదరిస్తారో వేచి చూడాల్సిందే...!

## బిఆర్ఎస్‌కు పార్టీ ఫిరాంపుల బెడద...

రాష్ట్రంలో తొమ్మిదన్నర ఏళ్ళ పాటు పాలనను అందించిన బిఆర్ఎస్ పార్టీని శాసన సభ ఎన్నికలలో ప్రతిపక్ష స్థానంలో నిలిపిన ప్రజలు.తెలంగాణలోని అత్యధిక స్థానాలలో బిఆర్ఎస్ పార్టీకి పార్టీ ఫిరాయింపుల బెడదను ఎదుర్కోంటున్నది.రాష్ట్రంలో అధికారం కోల్పోవడంతో కొంత మంది బిఆర్ఎస్ పార్టీని వీడి కాంగ్రెస్,బిజెపి పార్టీలోకి మారుతున్నారు.పార్లమెంట్ ఎన్నికల సమయంలో



క్యాడర్‌పార్టీని వీడి ఇతర పార్టీలో చేరడంతో పెద్దపల్లి స్థానంలో పట్టును కోల్పోయే అవకాశాలు ఉన్నాయని ప్రజలు అనుకుంటున్నారు.మరో వైపు జాతీయ పార్టీల నాయకులు బిఆర్ఎస్ పార్టీ గతంలో చేసిన పాలను వైఫల్యాలను ఎండ గడుతూ ప్రచారాన్ని కొనసాగిస్తున్నాయి.పెద్దపల్లి పార్లమెంట్ స్థానంలో నుండి పోటీ చేస్తున్న కొప్పుల ఈశ్వర్ అయా నియోజకవర్గాలలో తిరుగుతూ ప్రచారాన్ని చేస్తున్నప్పటికి గతంలో ప్రజలు చూపిన ఆదరణ కొరవడినట్లు ప్రజలు బాహాటంగానే అనుకుంటున్నారు.మరో వైపు బిఆర్ఎస్ అధినాయకులు కొప్పుల ఈశ్వర్ గెలుపు కోసం పార్లమెంట్ పరిధిలో రోడ్‌షో కార్యక్రమాలు చేపట్టారు.రోడ్‌షోలు,కార్నర్ మీటింగ్‌లు అభ్యర్థి గెలుపు ఏమేరకు ఉపయోగపడనున్నాయో.అయినప్పటికి బిఆర్ఎస్ పార్టీకి చెందిన వారు కొందురు పార్టీలు మారడంతో గెలుపు ఎంత వరకు ఉంటుందో ప్రజలే ఈ నెల 13న తేల్చనున్నారు.

## కమలానికి క్యాడర్‌లేమి...

భారతీయ జనతాపార్టీకి ప్రజలలో ఆదరణ ఉన్నప్పటికి పెద్దపల్లి పార్లమెంట్ పరిధిలో అనుకున్నంత క్యాడర్‌ను సంపాదించలేక పోయారు.పెద్దపల్లి పరిధిలోని ఏడు నియోజకవర్గాలలో కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేలే ఉన్నారు.దీంతో భారతీయ జనతా పార్టీ నరేంద్రమోదీ భారత దేశంలో చేసిన సంస్కరణలతోనే ఈ రోజు భారత్ వెలిగి పోతున్నదనే ప్రచారంతో ముందుకు సాగుతున్నారు.మరి నరేంధ్ర మోధీ చరిష్మా ఏమేరకు పని చేస్తుందో వేచి చూడాల్సిందే...!

# అద్దంకి దయాకర్ పై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు

**కడెం,మే 7, సూర్య మేజర్ న్యూస్ :**

హిందువులను కించపరిచేలా నిర్మల్ సభలో మాట్లాడిన కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు అద్దంకి దయాకర్ పై చర్యలు తీసుకోవాలని బిజెపి కడెం మండల అధ్యక్షుడు కాశవేణి శ్రీనివాస్ కోరారు. పై విషయమై మంగళవారం రోజున కడెం పోలీస్ స్టేషన్లో ఎస్సై కృష్ణ సాగర్ రెడ్డికి మండల బిజెపి నాయకులతో కలిసి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత అయిదవ తేదీన నిర్మల్




కాంగ్రెస్ బహిరంగ సభలో కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు అద్దంకి దయాకర్ హిందువుల మనోభావాలను దెబ్బతీసేల రాముడిని సీతమ్మ పట్ల అనుచిత వాక్యాలు చేసి ఓ వర్గాన్ని కించపరిచేలా మాట్లడిన దయాకర్ పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు లేనియెడల రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో మండల బిజెపి నాయకులు మందపల్లి రమేష్,గడప దేవరాజ్, రవీందర్ గౌడ్,గట్ల నల్లగొండ మండల బిజెపి నాయకులు తదితరులు పాల్గొన్నారు

# ఓటు హక్కుపై విద్యార్థులకు అవగాహన కల్పించిన సోషల్ జస్టిస్ ఫర్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ కుభీర్ మండల చైర్మేన్ సాప పండరి

**కుబీర్,మే 07,సూర్య మేజర్ న్యూస్**

కుబీర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో కొనసాగుతున్న డిగ్రీ పరీక్షల అనంతరం విద్యార్థులతో కుబీర్ మండల సోషల్ జస్టిస్ ఫర్ వరల్డ్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ చైర్మన్ సాప పండరి మాట్లాడుతూ 18 సంలు నిండిన యువతీ,యువకులు ఈ నెల 13 న జరిగే పార్లమేంట్ ఎన్నికలలో ఓటు అనే మీ పదునైన ఆయుధాన్ని వినియోగించుకోని సామాన్యులకు సైతం అందుబాటులో వుండే సమస్యలను పరిష్కరించడంలో ముందుండే నాయకుడిని ఎన్నుకోవాలని సూచించారు.విద్యార్థులకు వారి గ్రామాలలో వుండే నిరాక్షరాస్యులకు,వృధ్ధులకు ప్రతి ఒక్కరికి భారత రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును ప్రతి ఒక్కరు వినియోగించుకునే విధంగా వారిలో అవగాహన తీసుకురావాలని,అలాగయితేనే దేశం అభివృద్ధి చెందే సమర్థులైన నాయకులు ఎంచుకునే అవకాశం వుంటుందని,ఎవరైతే ఓటు హక్కును వినియోగించుకోరో వారు మరణించిన వారితో సమానమని విద్యార్థులకు సూచించారు.ఈ కార్యక్రమంలో అధ్యాపకులు లక్ష్మణ్,రాములు పాల్గోన్నారు.



# ఎండ తీవ్రత పట్ల జాగ్రత్తలు పాటించాలి

**- ఇంచార్జి ఈఓ అనూష**

**ముధోల్,మే07,సూర్య మేజర్ న్యూస్:**

రోజు రోజుకు ఎండ తీవ్రత పెరుగుతోంది. ఎండ తీవ్రత పట్ల ప్రతి ఒక్కరు జాగ్రత్తలు పాటించాలని ముధోల్ గ్రామ పంచాయతి ఇంచార్జి ఈఓ అనూష సూచించారు. మంగళవారం మండల కేంద్రంలో ఆరోగ్య సిబ్బందితో కలిసి ఎండ తీవ్రతకు గురి కాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎండ దాదాపు 45 డిగ్రీలకు చేరిందని పేర్కొన్నారు. ఇంత వేడీతో వడ దెబ్బలు వచ్చే అవకాశాలు చాలా ఉంటాయని తెలిపారు. వడదెబ్బకు గురి కావడం కంటే అది రాకుండా జాగ్రత్తలు పాటించడం ఉత్తమమని వెల్లడించారు.ఉదయం, సాయంత్రం వేళల్లో మాత్రమే బయట వెళ్లే పనులు పెట్టుకోవాలని సూచించారు. అత్యవసరమైతే తప్ప మధ్యాహ్నం పూట బయటకు వెళ్ళకూడదన్నారు.బయట తిరిగే వారు తల , చెవులు, ముక్కు కు వేడి గాలి తగలకుండా నివారణ చర్యలు చేపట్టాలని తెలిపారు. ముఖ్యంగా నీరు అధికంగా తాగాలని తెలిపారు. బయట నుండి ఎండలో రాగానే అతి చల్లని నీరు కూడా తాగొద్దని కాసేపు విశ్రాంతి తీసుకుని అవకాశం ఉంటే నీటితో తలపై నుండి స్నానం చేసి తరువాత మంచి నీరు తాగడం మంచిదని వివరించారు. ఎండాకాలం లో పెళ్లి వేడుకలు ఉండడం వాటిలో ఇచ్చే భోజనాల్లో అధిక నూనె వంటలు తాత్కాలికంగా మాత్రమే తిని పెరుగు, మజ్జిగ వంటి చల్లటి పదార్థాలను తీసుకోవాలని తెలిపారు. చిన్న పిల్లలను వారి పోషకులు ఎంత జాగ్రత్తగా ఉంచుకుంటే అంత మంచిదన్నారు.ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది ఏ ఎన్ఎం విజయ, ఆశా వర్కర్లు యమున,పుష్ప,సుజాత తదితరులు పాల్గొన్నారు.



# నగదు సీజ్




**కాసిపేట,మే 7,సూర్య మేజర్ న్యూస్**

కాసిపేట మండలంలోని సోమగుడెం చెక్ పోస్ట్ వద్ద మంగళవారం పోలీసులు వాహన తనిఖీ నిర్వహించగా రాజమౌళి , జుభీర్ ఖాన్ అనే వ్యక్తుల దగ్గర నుండి నగదును స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. రాజమౌళి దగ్గరనుండి రూ: 88000లు, జుబీర్ ఖాన్ దగ్గర నుండి రూ: 64500 లను సీజ్ చేసి ఎస్ ఎస్ టి స్టాఫ్ ఇంచార్జీకు అప్పగించినట్లు కాసిపేట ఎస్ఐ ప్రవీణ్ తెలిపారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# మండుటెండలో నిరుపేదలకు,అభాగ్యులకు అన్నదానం

**భైంసా,మే 07,సూర్య మేజర్ న్యూస్**

భైంసా ఫుడ్ బ్యాంక్ ఛైర్మన్ ఎం.ఆంజనేయులు మండు టెండలను లెక్క చేయకుండా వానల్ పాడ్ గ్రామ సరిహద్దులో,భైంసా పట్టణం చుట్టుపక్కల గుడారాలు వేసుకుని నివసిస్తున్న నిరుపేదల వద్దకు వెళ్లి వారికి అన్నప్రసాదాలు,అరటిపండ్లను ఇచ్చి వారి ఆకలిని తీర్చారు.ఇలా ఎండలను సైతం లెక్కచేయకుండా నిరుపేదల సేవలో పునీతులైన ఆంజనేయులును అందరూ అభినందిస్తున్నారు.



## కౌంటింగ్ కేంద్రంలో పూర్తి స్థాయిలో సౌకర్యాలు కల్పించాలి

**- జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్**

మొదటి పేజీ తరువాయి...

ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ 002-పెద్దపల్లి (ఎస్.సి.) పార్లమెంట్ నియోజకవర్గానికి జరుగనున్న ఎన్నికల నేపథ్యంలో జిల్లాలో ఎన్నికల నిర్వహణ, కౌంటింగ్ కొరకు పూర్తి స్థాయి ఏర్పాట్లతో సిద్ధంగా



ఉండాలని తెలిపారు. జిల్లాలోని 002 - చెన్నూర్ (ఎస్.సి.), 003-బెల్లంపల్లి (ఎస్.సి.), 004-మంచిర్యాల అసెంబ్లీ సెగ్మెంట్లకు సంబంధించి కౌంటింగ్ జరుగుతుందని, కౌంటింగ్ ప్రక్రియకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేయాలని, కౌంటింగ్ రోజున ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరుగకుండా బందోబస్తు నిర్వహించాలని తెలిపారు. కౌంటింగ్ కేంద్రంలో కౌంటింగ్ హాల్లు, కౌంటర్లు, విద్యుత్, ఇంటర్నెట్, త్రాగునీరు ఇతరత్రా పూర్తి సదుపాయాలు కల్పించాలని తెలిపారు. మే 13న పోలింగ్, జూన్ 4న కౌంటింగ్ జరుగుతాయని, ఎన్నికల ప్రవర్తనా నియమావళి జూన్ 6వ తేదీ వరకు అమలులో ఉంటుందని తెలిపారు. ఎన్నికల విధులు కేటాయించబడిన అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, ఎన్నికల ప్రవర్తనా నియమావళికి లోబడి పని చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల విభాగం అధికారులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజలకు రక్షణ కవచం పోలీస్

**... ప్రశాంత వాతావరణంలో ఓటు హక్కు వినియోగించుకోవాలి**

**...., సీఐ అఫ్జలుద్దీన్**

**బెల్లంపల్లి టౌన్, ఏప్రిల్ 7 సూర్య మేజర్ న్యూస్**

ప్రజలు ప్రశాంతమైన వాతావరణం లో తమ ఓటుహక్కును నిజాయితీగా నిర్వర్తించుకోవాలని బెల్లంపల్లి రూరల్ సిఐ అఫ్జలుద్దీన్ అన్నారు.పార్లమెంట్ ఎన్నికల్లో భాగంగా నెన్నెల మండలంలోని సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను బిఎస్ ఎఫ్ కేంద్ర బలగాలతో కలిసి కవాతు నిర్వహించారు.పోలింగ్ కేంద్రాలను సందర్శించి సౌకర్యాలను పరిశీలించారు.ఈసందర్భంగా సిఐ మాట్లాడుతూ ప్రజల రక్షణ కు పోలీసులు నిత్యం కృషి చేస్తారని రాబోయే ఎన్నికల్లో వంద శాతం ఓటుహక్కును వినియోగించుకోవాలని సూచించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా భద్రతలు కట్టుదిట్టం చేస్తున్నామన్నారు.ఎవరైనా అక్రమ కార్యాలకలపాలకు పాల్పడితే ఉపేక్షించేది లేదని కఠిన చర్యలుంటాయన్నారు.యువత బాధ్యత గా ఉండాలని,అసంఘటిత చర్యలకు పాల్పడితే జీవితం రోడ్డు పాలు అవుతుందన్నారు.మంచి మార్గం లో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని పార్లమెంట్ ఎన్నికల్లో అందరూ ఓటు వేసేందుకు యువత తమ వంతు బాధ్యతను నిర్వర్తించాలని కోరారు. కార్యక్రమంలో బిఎస్ ఎఫ్ ఏసి డేవిడ్ లాల్ తన్సీలామ,సిఐ లు రాకేష్ మిశ్రా,విపిన్ కుమార్,ఎస్సై ప్రసాద్, హెడ్ కానిస్టేబుల్ విజయ్, కానిస్టేబుల్ అనంత రావు, క్రిష్ణ,సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా రాజకీయ పార్టీలు సహకరించాలి

**- జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ వెంకటేష్ ధోత్రే**

**ఆసిఫాబాద్ ప్రతినిధి 7 మే సూర్య మేజర్ న్యూస్**

లోక్ సభ ఎన్నికలలో 001-ఆదిలాబాద్ (ఎస్. టి.) పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని జిల్లాలో 001-సిర్పూర్, 005-ఆసిఫాబాద్ (ఎస్. టి.) అసెంబ్లీ సెగ్మెంట్లలో ఈ నెల 13వ తేదీన జరగనున్న పోలింగ్ ప్రక్రియ ప్రశాంతంగా జరిగేలా రాజకీయ పార్టీలు, అభ్యర్థులు సహకరించాలని జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ వెంకటేష్ ధోత్రే అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని సమీకృత కలెక్టరేట్ భవన సముదాయంలోని కలెక్టర్ సమావేశ మందిరంలో ఆసిఫాబాద్ రాజస్వ మండల అధికారి లోకేశ్వర్





రావు తో కలిసి గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఎన్నికల నిర్వహణ, పోలింగ్ ప్రక్రియపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఆదిలాబాద్ పార్లమెంట్ పరిధిలోని జిల్లాలో సిర్పూర్, ఆసిఫాబాద్ అసెంబ్లీ సెగ్మెంట్లలో జరగనున్న ఎన్నికల నిర్వహణలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు, పొరపాట్లు లేకుండా ప్రశాంత వాతావరణంలో పోలింగ్ జరిగే విధంగా రాజకీయ పార్టీలు, అభ్యర్థులు సహకరించాలని తెలిపారు. పోలింగ్ రోజున పూర్తి స్థాయిలో ఓటింగ్ జరిగే విధంగా ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని, ఈ క్రమంలో 85 సంవత్సరాల వయసు పైబడిన వయోవృద్ధులు, పోలింగ్ కేంద్రాలకు రాలేని దివ్యాంగులకు హోం ఓటింగ్ ద్వారా అవకాశం కల్పించడం జరిగిందని, ఇందు కొరకు 157 మంది దరఖాస్తు చేసుకోగా 151 మంది హోమ్ ఓటింగ్ ద్వారా ఓటు హక్కు వినియోగించుకున్నారని తెలిపారు. పోలింగ్ కేంద్రాలలో విద్యుదీకరణ, ఫ్యాన్లు, త్రాగునీరు, మూత్రశాలలు, ర్యాంప్ ల ఏర్పాటుతో పాటు ఓ.ఆర్.ఎస్. ప్యాకెట్లను అందుబాటులో ఉంచడం జరుగుతుందని తెలిపారు. అత్యవసర సేవలు అందిస్తున్న వారు, ఎన్నికల విధులు నిర్వహిస్తున్న వారు పోస్టల్ బ్యాలెట్ ద్వారా తమ ఓటు హక్కు వినియోగించుకునేందుకు ఈనెల 8వ తేదీ వరకు రాజస్వ మండల అధికారి కార్యాలయంలో ఓటరు ఫెసిలిటేషన్ కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందని, 6వ తేదీ వరకు 1 వేయి 934 మంది ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కు వినియోగించుకున్నారని తెలిపారు. జిల్లాలో 4 లక్షల 56 వేల 309 మంది ఓటర్లకు గాను ఇప్పటి వరకు 4 లక్షల 24 వేల 356 మందికి బూత్ స్థాయి అధికారుల ద్వారా ఓటరు స్లిప్పులు అందజేయడం జరిగిందని, 1 వేయి 339 ఓటరు గుర్తింపు కార్డులను బూత్ స్థాయి అధికారుల ద్వారా పంపిణీకి చర్యలు తీసుకుంటున్నామని, సింబల్ లోడింగ్ యూనిట్లను స్ట్రోరేజ్ రూమ్ లలో భద్రపరచడం జరిగిందని, 2 నియోజకవర్గాలలో ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల కమీషనింగ్ ప్రక్రియ పూర్తి చేయడం జరిగిందని తెలిపారు. నియోజకవర్గాల వారీగా మహిళలకు 5, దివ్యాంగులకు 1, యువత కొరకు 1, మోడల్ పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయడం జరుగుతుందని, షాడో పోలింగ్ కేంద్రాలలో సి సి కెమెరాలను బయట ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని, పోలింగ్ రోజున ఓటింగ్ శాతం తెలిపేందుకు వైర్ లెస్ సెట్లను వినియోగించడం జరుగుతుందని తెలిపారు. జిల్లాలో ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు రాజకీయ పార్టీలు సహకరించాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎన్నికల నాయబ్ తహసిల్దార్ జితేందర్, ఎన్నికల విభాగం అధికారులు, రాజకీయ పార్టీల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## బస్టాండ్లలో ట్యాంకులు పెట్టారు నీళ్లు మరిచారు.




**నేరడిగొండ ఏప్రిల్ 7, సూర్య మేజర్ న్యూస్**

కె ఎన్ ఆర్ సి. కె ఎన్ ఆర్ సి రోడ్డుసంస్థ వారు నాలుగు లైండ్ల రోడ్ల వేశారు రోడ్డు వెంబడి ప్రయాణికుల కొరకు గ్రామాల వద్ద కె ఎన్ ఆర్ సి వారు షెడ్డు ఏర్పాటు చేశారు ప్రజలు నీళ్లు తాగటానికి నీళ్ల ట్యాంకులను ఏర్పాటు చేశారు కానీ రోజు ప్రయాణించే ప్రజల కొరకు ట్యాంకులలో నీళ్లు పోయడం మరిచారు రోజు అదిలాబాద్ నిర్మల్ బోథ్ బస్ స్టాప్ లలో ప్రజలకు నీరు దొరకడం లేదువేసవి కావడం వలన చుక్కనీరు దొరకక తల్లడిల్లుతున్నారు ఇకనైనా కేఎన్ఆర్ సి రోడ్డు సంస్థ వారు బస్టాప్ లలో పెట్టిన వాటర్ ట్యాంకులలో నీళ్లు పోయాలని ప్రజలు అంటున్నారు.

## అన్నదాతకు అరి గోస

**- కారు మబ్బులతో రైతు భయం భయం - పండిన పంట చేజారుతుందేమోనని ఆందోళన - వరి కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలని రైతుల డిమాండ్**



**కడెం,మే 7, సూర్య మేజర్ న్యూస్ :**

కడెం మండలంలో మంగళ వారం రోజున కారుమబ్బులు రైతులను భయపెట్టాయి.ఆకాశమంతా కారుమబ్బులు కమ్మేయడంతో రైతులు ఆగమాగం అవుతున్నారు. కేంద్రాల్లోని వరి ధాన్యం , పంట పొలాల్లోని వరిని కాపాడుకునేందుకు రైతులు నానా తంటాలు పడుతున్నారు. మండలంలో కొనుగోలు కేంద్రాలు మాత్రం ప్రారంభం కాలేదు. మండలంలోని చాలా గ్రామాల తో పాటు లింగాపూర్ గ్రామంలో గత 15 రోజుల నుండి రైతులు వడ్లను కొనుగోలు కేంద్రాలకు తీసుక వస్తున్న కొనే వారు దిక్కులేరు అంటున్నారు రైతులు . కేంద్రాల వద్ద పూర్తిస్థాయిలో ధాన్యం కొనుగోలు జరగకపోవడంతో అకాల వర్షాలు కురిస్తే వడ్లు ఎక్కడ తడిసిపోతాయోనని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కేంద్రాల వద్ద ఉన్న ధాన్యాన్ని వెనువెంటనే కొనుగోలు చేసి తరలించాలంటూ రైతులు డిమాండ్ చేస్తున్నారు. గాలి తాకిడికి వరి పై కప్పిన కవర్లు కూడా ఎగిరి పోవడం తో ఎక్కడ వర్షం కురుస్తుందో అని ఆందోళన చెందుతున్నారు. అధికారులు స్పందించి తక్షణమే కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలంటున్నారు రైతులు.

**పరుగులు తీస్తున్న రైతులు...**

మండలంలో వాతావరణం ఉన్నట్టుండి మారిపోవడంతో కేంద్రాల్లోని ధాన్యాన్ని కాపాడుకునేందుకు రైతులు పరుగులు తీశారు. కోతకు వచ్చిన పొలాలు గాలి దుమారానికి, వర్షానికి అడ్డం పడుతాయని రాశులు ఉన్న ధాన్యం తడిస్తుందేమోనని ఆవేదన చెందుతున్నారు . ఇప్పటికే పంటను కోసి కల్లాలు, కేంద్రాల్లో ఆరబెట్టుకున్న రైతులు కుప్పలుగా పోసి పట్టాల కోసం ఉరుకులు పరుగులు పెట్టారు .



## ఎల్లవేళలా కార్మికుల సమస్యలపై పోరాడి సాధించేది ఏఐటీయూసీ మాత్రమే!

### - ఏఐటీయూసి సెంట్రల్ సెక్రెటరీ: ఎండి అక్బర్ అలీ

**రామకృష్ణాపూర్ ,07మే,సూర్య మేజర్ న్యూస్**

మందమర్రి ఏరియా రామకృష్ణాపూర్‌లో ఏఐటీయూసీ యూనియన్ ఆఫీసులో జరిగిన సమావేశంలో సెంట్రల్ సెక్రెటరీ అక్బర్ అలీ మాట్లాడుతూ ఏదైతే నల్ల బ్యాడ్జీల నిరసన తెలియజేసి వేసవికాలంలో ఎండ తీవ్రత వల్ల కార్మికులు అనారోగ్యానికి గురి అవుతున్నారు కాబట్టి కార్మికుల సంక్షేమం దృష్ట్యా యాజమాన్యానికి డిమాండ్ చేసిన విధంగా యాజమాన్యం షిఫ్ట్ వేళలు మార్చడం ద్వారా ఈ ఎండ తీవ్రత నుంచి కాపాడడం ద్వారా కార్మికుల రక్షణ కొరకు చర్యలు తీసుకోవడం జరిగింది, అదే విధంగా సింగరేణి వ్యాప్తంగా ఉన్న చాలా సిబ్బంది ఎన్నికల విధులకి వెళ్లడం జరుగుతుంది గతంలో ఆదివారం వస్తే షేడే ఇచ్చే వాళ్ళు ఓడి ఇచ్చేవాళ్ళు కానీ ఈ మధ్యకాలంలో ఏదో స్పెషల్ లీవ్ అని చెప్పేసి ఇవ్వడం ద్వారా వాళ్ళు వేతనాలు నష్టపోతూ అదే విధంగా మాస్టర్లు ఎందులోనూ కలవకుండా స్పెషల్ ఇవ్వాడం వల్ల దాని వల్ల నష్టపోవడం జరుగుతుంది. యాజమాన్యాన్ని గుర్తు చేసి గతంలో జరిగిన విధానాలను అమలు చేయాలని డిమాండ్ చేస్తే యాజమాన్యం ఎవరైతే ఎలక్షన్ డ్యూటీ కి వెళ్తారు వాళ్ళందరూ గతంలో లాగా ఓడి ఇవ్వడానికి ఒప్పుకోవడం జరిగింది, పెండింగ్ సమస్యలను కూడా పరిష్కరించుకోవడం జరిగింది, ఇక పార్లమెంటు ఎన్నికలు జరుగుతున్నాయి విడుదల వారిగా జరిగిన ఎన్నికలలో దాదాపుగా చాలా చోట్ల కాంగ్రెస్ అత్యధిక మెజార్టీతో ఇండియా కూటమి అత్యధిక మెజార్టీతో గెలుస్తున్నట్లుగా తెలుస్తుంది దాన్ని తట్టుకోలేని బిజెపి లేని పోనీ విద్వేష ప్రచారాలు కుల మతాలను రెచ్చగొట్టే విధంగా కులతత్వం మత తత్వం పెంచేసి మరి ప్రజలను అయోమయం గురి చేయడం జరుగుతుంది తప్పుడు వీడియోలు ప్రచారం చేయడం ద్వారా ప్రజలను ఏదో మభ్యపెట్టి ఓట్లు పొందడానికి బిజెపి కుట్రలు పన్నుతుంది కాబట్టి మరి ఈ రానున్న రోజులు చాలా కీలకమైనవి మన భవిష్యత్తు మన దేశ భవిష్యత్తు మన రానున్న తరాల భవిష్యత్తు ఆధారపడింది కాబట్టి ప్రజలు కార్మికులు ముక్తకంఠంతో కుటుంబాలతో సహా బిజెపిని తిప్పి కొట్టడం ద్వారా మన భవిష్యత్ తరాలు కాపాడుకోవచ్చు మరి ఏదైతే ఇప్పటికే దేశంలో ఉన్న నిరుద్యోగం అధిక ధరల వల్ల మరి కార్మికులు అల్లాడుతుంటే ఎక్కడ కొత్త పరిశ్రమలు తేకపోగా ఉన్న పరిశ్రమలను అమ్ముకొని మరి వాటి ద్వారా సొమ్ము చేసుకున్న డబ్బు ద్వారా ఇప్పుడు ఎన్నికల్లో లబ్ధి పొందడానికి బిజెపి కుట్ర చేస్తున్నది కాబట్టి ప్రజలు తమ చేతిలో ఉన్న ఆయుధాన్ని గాని విస్మరిస్తే రానున్న రోజులలో ఆయుధం పట్టడం కాదు కదా ఏ పోరాటానికి కూడా మిగిలి ఉండే పరిస్థితి లేదు కాబట్టి ఈ ఫాసిస్టు బిజెపి ప్రభుత్వం అందరిని అణిచివేస్తుంది కాబట్టి ఇప్పటికే ఉన్న హక్కులని కార్మికుల హక్కులని మార్చివేసి ఏదో కొత్త కోడ్స్ తెచ్చింది కాబట్టి ప్రభుత్వాన్ని మళ్ళీ తీసుకొస్తే మనం కష్టాల పాడుతాం మన భవిష్యత్తు కోసం మంచి నిర్ణయం తీసుకొని ఈ 13 తారీకు రోజు ఏదైతే ఎన్నికలు జరుగుతుందో మన ప్రాంతంలో గడ్డం వంశీ ఇండియా కూటమి కాంగ్రెస్ అభ్యర్థి నిలబడటం జరిగింది వారి గుర్తు హస్తం గుర్తుపై ఓటు వేసి గెలిపించడం ద్వారా ఈ ప్రాంతంలో మన సమస్యలను పరిష్కరించుకోవాలి యాన్సీలరీ యూనిట్స్ తీస్తం ఇక్కడ కొత్తా పరిశ్రమలు తేస్తామని చెప్పేసి వాళ్ళు కూడా హామీ ఇవ్వడం జరిగింది. అదేవిధంగా సింగరేణికి రావాల్సిన 29 వేల కోట్ల బకాయిలు ఇప్పిస్తామని చెప్పడం జరిగింది. సింగరేణి కార్మికులు చాలా కాలంగా ఎదురుచూస్తున్న పెర్క్స్ పైన ఇన్కమ్ టాక్స్ యాజమాన్యం చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలని హామీ ఇవ్వడం జరిగింది. సొంతింటి పథకం అమలు చేస్తామని చెప్పడం జరిగింది ఇక్కడి కాంట్రాక్ట్ కార్మికులు కూడా కనీస వేతనాలు అమలు చేయడానికి ఒప్పుకున్నారు కాబట్టి ఏఐటీయూసీ ఇండియా కూటమి అభ్యర్థిని బలపరచడం జరిగింది కావున కార్మికులు కార్మిక కుటుంబాలు ఈ ప్రాంత ప్రజలందరూ గడ్డం వంశీ చేతి గుర్తు మీద ఓటు వేసి గెలిపించడం ద్వారా మన ప్రాంతాన్ని అభివృద్ధి చేసుకోవాలనీ కోరరు ఈ కార్యక్రమంలో రామకృష్ణాపూర్ ఏరియా వైస్ ప్రెసిడెంట్ ఇప్పకాయల లింగయ్య, ఆర్కె పి సి హెచ్పి ఫిట్ కార్యదర్శి హరి రామకృష్ణ, కమిటీ మెంబర్స్ మాదాసి వేణుగోపాల్, శ్రీనివాస్ యాదవ్, ఓసి పిట్ కమిటీ



మెంబర్స్ కోరేల శ్రీనివాస్, రమేష్ పుష్పరాజ్ , గోవిందుల రమేష్ గాజుల రాయమల్లు దేవానందం మొదలగువారు పాల్గొన్నారు.

## పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకున్న ఉద్యోగులు




**నిర్మల్,మే 7, సూర్య మేజర్ న్యూస్**

పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో నిర్మల్ మండల నీటిపారుదల శాక ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కును మంగళవారం వినియోగించుకున్నారు. నిర్మల్ ఆర్డీవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రంలో ప్రభుత్వ ఉద్యోగులతో పాటు జర్నలిస్టులు తమ ఓటు హక్కును ఉపయోగించుకున్నారు. రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని కోరారు.

## నిర్మల్‌లో భారీ ఈదురుగాలులు



**నిర్మల్ ,మే 7, సూర్య మేజర్ న్యూస్**

భానుడి భగభగలతో అల్లాడుతున్న నిర్మల్ జిల్లా ప్రజలకు కొంత ఉపశమనం కలిగింది. మంగళవారం మధ్యాహ్నం నిర్మల్ జిల్లాలోని పలు మండలాల్లో భారీ గాలి దుమారం వీచింది. ఎండ తీవ్రతో ఇబ్బందులు పడ్డ ప్రజలు వాతావరణం చల్లబడి గాలులు వీయడంతో కొంతమేరకు ఉపశమనం పొందారు. పల్లెల్లో రైతులు ముందు జాగ్రత్తగా ధాన్యం తడిసిపోకుండా ఉండేందుకు పంట కల్లాల వైపు పరుగులు తీశారు.

## నిర్మల్ ఎక్సైజ్ శాఖ అధికారిని కలిసిన గీత కార్మిక సంఘ సభ్యులు




**నిర్మల్, మే 7, సూర్య మేజర్ న్యూస్**

నిర్మల్ జిల్లా ఎక్సైజ్ శాఖ సూపరింటెండెంట్‌గా మెదక్ జిల్లా నుంచి బదిలీపై వచ్చిన ఎండీ అబ్దుల్ రజాక్ ను మంగళవారం జిల్లా గీత పారిశ్రామిక సహకార సంఘ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు పూల మొక్క అందజేసి శాలువాతో సత్కరించి స్వాగతించారు. కార్యక్రమంలో సంఘ నాయకుడు లింగ గౌడ్, మోకు దెబ్బ జాతీయ అధ్యక్షుడు నర్సాగౌడ్, తదితరులు ఉన్నారు.

## నేల రాలిన పంట

**పెంబి, మే 7,సూర్య మేజర్ న్యూస్:**

మంగళవారం వీచిన ఈదురు గాలుల ప్రభావంతో పెంబి మండలంలోని మామిడి పంట నేల రాలింది. మామిడి కౌలు రైతులు



చాబంతి సహా దేవు, పెండెల భీమేష్ సాగు చేస్తున్న మామిడి పంట నేల రాలిందని రైతులు వాపోతున్నారు. ఈదురు గాలులకు నేల రాలిన పంటలు, నేల కొరిగిన ఇతర పంటలను సిపిఐ ఎంఎల్ న్యూ డెమొక్రసీ జిల్లా నాయకులు మంచికంటి లక్ష్మణ్ పరిశీలించారు. ఈ సందర్భంగా నష్ట పోయిన ప్రతి రైతుకు నష్ట పరిహారం చెల్లించి కాంగ్రెస్ ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేసారు.

## పార్లమెంట్ ఎన్నికల్లో ఓటర్లంతా తమ ఓటు హక్కును విధిగా వినియోగించుకోవాలి

### - జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్

**నిర్మల్ ప్రతినిధి,మే 7, సూర్య మేజర్ న్యూస్**

మే 13 న జరగబోయే పార్లమెంట్ ఎన్నికల్లో ఓటర్లంతా తమ ఓటు హక్కును విధిగా వినియోగించుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ అన్నారు. జిల్లాలో పోలింగ్ శాతం పెంచేందుకు, ఓటర్లకు అవగాహన కల్పించేందుకు మంగళవారం ఉదయం స్వీప్ (సిస్టమాటిక్ ఓటర్స్ ఎడ్యుకేషన్ అండ్ ఎలక్టోరల్ పార్టిసిపేషన్) ఆధ్వర్యంలో ఆర్డీఓ నుండి నిర్వహించిన 5కే రన్ ను ఆయన జెండా ఊపి ప్రారంభించారు. ఆర్డీఓ కార్యాలయం నుండి బస్టాండ్ సమీపంలోని అంబేద్కర్ చౌక్ వరకు ర్యాలీగా చేరుకొన్నారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొని మాట్లాడుతూ, ఓటు హక్కు అనేది రాజ్యాంగం మనకు కల్పించిన గొప్ప వరమని, ఓటర్లంతా బాధ్యతగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు. గత ఎన్నికల్లో గ్రామీణ ప్రాంతాలతో పోలిస్తే పట్టణ ప్రాంతాల్లో తక్కు వ ఓటింగ్ నమోదయ్యిందని, ఈ ఎన్నికల్లో పట్టణప్రాంత ఓటర్లుందరూ తమ ఓటు హక్కు వినియోగించుకొని వంద శాతం పోలింగ్ నమోదయ్యేలా కృషి చేయాలని అన్నారు. ఇప్పటికే జిల్లాలో ఎన్నికల నిర్వహణకు సంబందించి అన్నీ ఏర్పాట్లను పూర్తి చేయడం జరిగిందని తెలిపారు. ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పోలింగ్ కేంద్రాల వద్ద టెంట్లు, త్రాగునీరు, బెంచీలు, అత్యవసర మందులు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు, వైద్య సిబ్బందిని, వికలాంగులకు ఇబ్బందులు కలగకుండా వీల్ చైర్స్, ర్యాంప్ వంటి సౌకర్యాలు కల్పించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు ఫైజాన్ అహ్మద్, కిషోర్ కుమార్, డీఆర్వో భుజంగ్ రావ్, డిఆర్ డిఓ విజయలక్ష్మి, డీఈవో రవీందర్ రెడ్డి, డీపీఆర్వో విష్ణువర్ధన్, వివిధ శాఖల జిల్లా అధికారులు, సిబ్బంది, పట్టణ ప్రజలు, యువత, తదితరులు పాల్గొన్నారు.




## ఈదురుగాలులకు కూలిన ఇల్లు

**నిర్మల్ ప్రతినిధి ,మే 7, సూర్య మేజర్ న్యూస్**

దిలావర్పూర్ మండల కేంద్రంలో మంగళవారం సాయంత్రం వీచిన ఈదురుగాలులకు ఓ నిరుపేద ఇల్లు నేలమట్టమైంది. గ్రామానికి చెందిన వెంకటరమణ ఆయన తల్లి సుశీలమ్మతో కలిసి రేకుల ఇంటిలో నివాసం ఉంటున్నారు. తల్లి వృద్ధురాలు కావడంతో కొడుకు కూలి నాలి చేసుకుంటూ జీవిస్తున్నాడు. ఈరోజు వీచిన గాలులకు వారి ఇల్లు కూలిపోయింది. దీంతో తన నివాసం కోల్పోయానని బాధితుడువాపోయాడు. ప్రభుత్వం సహాయం చేయాలని కోరాడు.

